క్లుప్తంగా

పశువైద్యుడు, సిబ్బందికి సన్మానం



సన్మానిస్తున్న గోపాలమిత్రలు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో పని చేసిన పశువైద్యుడు వేముల సంతోష్‌కుమార్, సిబ్బంది ప్రవీణ్‌కుమార్, సాధిక, గణేష్ ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం టేకులపల్లి మండలానికి చెందిన గోపాలమిత్రలు వెంకటేశ్వర్లు, భాస్కర్, అన్వేష్, సిబ్బంది బదిలీ అయిన అధికారి, సిబ్బందికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మండలంలో వారు చేసిన సేవలను కొనియాడారు.

నేడు సీఎండీ జన్మదిన వేడుక

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ జన్మదినాన్ని సందర్భంగా సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట, కారుకొండ రామవరంలోని బౌద్ధరామం వద్ద నిర్వహించనున్నట్లు సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీగంధం మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం హెడ్డాఫీస్ ఎదట అన్నదాన కార్యక్రమం ఉంటుందని, సింగరేణి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, పట్టణ ప్రజలు అందరూ అహ్వానితులేనని, అన్నివర్గాల ప్రజలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చింతలగుంపులో లింగన్నకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎన్డీ నాయకులు

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామపంచాయతీ చింతలగుంపులో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అమరుడు లింగన్న వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నాయకులు మూడు మాలు, జోగ కృష్ణ, వాంకుడోత్ మోతీలాల్ మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం సుదీర్ఘ కాలం అజ్ఞాత దళంలో పనిచేసి దళకమాండర్‌గా కొనసాగి పేదల కోసం అహర్నిశలు ఉద్యమించిన నేత లింగన్న అని కొనియాడారు. పేదలకు పోడు భూముల పంపిణీలో లింగన్న కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రజా నాయకుడిగా ఎదిగిన లింగన్నను పోలీసులు చాటుగా పట్టుకొని కాల్చి చంపారని విమర్శించారు. ఆయన ఆశయ సాధన కోసం ఉద్యమించాలని కోరారు.

పెట్రోల్ తక్కువ వచ్చిందని ఘర్షణ

పాల్వంచ: పాత పాల్వంచ పెట్రోల్ బంక్‌లో ఓ వినియోగదారుడు పెట్రోల్ తక్కువ వచ్చిందని బంక్ నిర్వాహకులతో ఘర్షణకు దిగాడు. వివరాలు ఆదివారం ఓ వ్యక్తి తన బైక్‌కు పెట్రోల్ కొట్టించుకునేందుకు వచ్చాడు. రూ.200 పెట్రోల్ కొట్టాలని చెప్పాడు. 1.85 లీటర్ల పెట్రోల్ కొట్టాల్సి ఉంది. కొట్టిన తర్వాత అనుమానం వచ్చిన సదరు వ్యక్తి పక్కనే ఉన్న మెకానిక్ షాపుకి వెళ్లి చెక్ చేయించాడు. దీంతో ఒక లీటర్ మాత్రమే ఉండడంతో బంక్ నిర్వాహకులను నిలదీశాడు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఆ వ్యక్తిని స్టేషన్‌కు తీసుకెళ్లి వదిలేశారు.

రైతుబీమాతో ధీమా

- దరఖాస్తుకు ఆగస్టు 5 గడువు
- జూన్ 28 లోపు పట్టా వచ్చి ఉండాలి



పత్తి చేలో పాటు చేస్తున్న రైతు

సుజాతనగర్: ఆరుగాలం శ్రమించే అన్నదాతకు అండగా ప్రభుత్వం రైతు బీమా పథకం అమలుకు చర్యలు చేపట్టింది. వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులకు అనుకోని ఘటనల్లో ఏదైనా ప్రాణహాని జరిగితే ప్రమాదవశాత్తు కింద ప్రభుత్వం రూ.5 లక్షలను బాధిత కుటుంబీకులకు అందిస్తుంది. కొత్తగా పట్టాపాసు పుస్తకం పొందినవారు, గతంలో బీమా పథకంలో ఉండి నామినీ చనిపోయినవారు, ఆధార్ కార్డులో తప్పులున్నా సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది.

ఎక్కువ మంది వ్యవసాయంలోనే...

నియోజకవర్గంలో చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం, పాల్వంచ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో అత్యధికంగా వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రైతులు పంట పొలాల వద్దే ఉంటుంటారు. అనుకోని పరిస్థితుల్లో రైతు అకాల మరణం చెందితే అతడి కుటుంబసభ్యులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఆ కుటుంబం సైతం గట్టెక్కాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. రైతులకు కుంట భూమి ఉన్నా ఈ పథకం వర్తిస్తోంది. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది.

అర్హుల ఖాతాల్లోకే నేరుగా..

రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకున్న రైతు అకాలమరణం చెందితే మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాతో పాటు నామినీ పత్రాలు అందిస్తేనే రూ.5 లక్షల పరిహారం అందుతుంది. సదరు ఖాతాలో నగదు జమయ్యేలా ఏఈఓలు ప్రక్రియ చేపడతారు. ఈ పథకంలో ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటారు. పరిహారం నేరుగా ఎవరి ప్రమేయం లేకుండానే ఖాతాలో జమ అవుతుంది.

2018 నుంచి రైతుబీమా లబ్ధిదారులు..

మండలం	లబ్ధిదారులు	పరిహారం
సుజాతనగర్	72	రూ.3.60 కోట్లు
కొత్తగూడెం	2	రూ.10 లక్షలు
లక్ష్మీదేవిపల్లి	88	రూ.4.40 కోట్లు
పాల్వంచ	90	రూ.4.50 కోట్లు
చుంచుపల్లి	35	రూ.1.75 కోట్లు
మొత్తం	287	రూ.14.35 కోట్లు

జూన్ 28లోపు పట్టా ఉంటేనే..

కొత్తగా పట్టాలు పొందినవారు ఆగస్టు 5 లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎల్ఐసీ నిబంధనల ప్రకారం ఆధార్ కార్డులో వయస్సు 18 నుంచి 59 ఏళ్ల లోపు ఉండాలి. వీరికి రైతు బీమా అందుతుంది. ఈ సారి జూన్ 28లోపు పట్టాదారు పాసుపుస్తకం లేదా తహసీల్దారుతో డిజిటల్ డీఎస్ పేపర్ ఉన్నవారే అర్హులు. దాని తర్వాత పాసు పుస్తకం వచ్చినవారు దరఖాస్తుకు అనర్హులని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అర్హులైనవారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జీరాక్స్‌లను స్థానికంగా ఏఈఓలకు అందించాలి. వారు వ్యవసాయశాఖ సైట్‌లో తమ ఐడీ ద్వారా లాగిన్ అయి వివరాలను నమోదు చేస్తారు. వీరికి ప్రభుత్వమే ఎల్ఐసీ ప్రీమియం చెల్లిస్తుంది. రైతు బీమాలో నామినీ స్థానంలో మార్పులు, చేర్పులు, ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు ఈనెల 30లోగా, 10 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు ఆగస్టు 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంతకు ముందు దరఖాస్తు చేసుకుంటే కొత్తగా ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఆ శాఖాధికారులు వెల్లడించారు.

సకాలంలో దరఖాస్తు చేసుకోవాలి..



కొత్తగా పట్టా పాసుపుస్తకం వచ్చిన రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఎలాంటి అనుమానాలున్నా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి. రైతు వేదికల్లో ఏఈఓలు అందుబాటులో ఉంటారు. వారిని అడిగినా సందేహాలను నివృత్తి చేస్తారు. సకాలంలో దరఖాస్తులు అందజేయాలి.

– డి.రమేష్, కొత్తగూడెం ఏడీఏ

మార్గదర్శకులుగా నడుచుకోవాలి



బిషప్‌కు స్వాగతం పలుకుతున్న క్రైస్తవులు

టేకులపల్లి: క్రైస్తవులు సమాజానికి మార్గదర్శకులుగా నడుచుకోవాలని ఖమ్మం బిషప్ (పీఠాధిపతి) సగిలి ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఇటీవల బిషప్‌గా నూతనంగా నియమితులైన ఆయన తొలిసారిగా ఆదివారం సులానగర్‌లోని ఆర్‌సీఎం చర్చిని సందర్శించారు. ఫాదర్ తుంపాటి అగస్టిన్ ఆధ్వర్యంలో కొయ్యగూడెం, మాలపల్లి, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, చిన్నారులు నృత్యం చేస్తూ, పాటలు పాడుతూ, పూలు చల్లుతూ బిషప్‌కు ఘనంగా స్వాగతం పలికారు. బిషప్ మాట్లాడుతూ.. ప్రతీఒక్కరు దైవమార్గంలో మెలగాలన్నారు. అనంతరం బిషప్‌ను వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ అల్లం జాజిరెడ్డి, విజయ్, సిస్టర్లు రోస్లిన్, శాంత కుమారి, రాజమ్మ, గ్రేసీ రూబీ, పంతులు, చింతమల్ల రాములు, కర్లపూడి బాబురావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారకులను శిక్షించండి..

పాల్వంచ: డిగ్రీ విద్యార్థి విష్ణుపై మూకుమ్మడిగా దాడి చేసిన విషయంపై విచారణ చేసి చట్టపరంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. ఆదివారం ప్రభుత్వాస్పత్రి వద్ద విష్ణు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎంతో భవిష్యత్ ఉన్న విష్ణు మృతి బాధాకరం అన్నారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, దారా శ్రీనివాస్, వైఎస్ గిరి, వర్కా అజిత్, యర్రంశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూమి దక్కే వరకూ పోరాటం



ముదిగొండ అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ముదిగొండ అమరవీరుల స్ఫూర్తితో పేదలకు భూమి దక్కే వరకు పోరాటాలు సాగిస్తామని, పోరాటాలే అమరవీరులకు ఇచ్చే నిజమైన నివాళి అని, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అన్నారు. ముదిగొండ అమరవీరుల 17వ వర్ధంతి కార్యక్రమం కొత్తగూడెంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపానికి పార్టీ సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... 17 సంవత్సరాల క్రితం పేదలకు ఇళ్ల, స్థలాలు కావాలని, రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం నిర్వహించిన పోరాటాలు ఎంతోమంది పేదలను భూమి కొరకు ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకొచ్చేలా చేశాయని గుర్తుచేశారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి హెచ్చరికలు లేకుండా పాశవికంగా ముదిగొండలో కాల్పులు జరిపిందని ఆరోపించారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని, ఈ పద్ధతి వీడి ప్రజల న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేపాకుల శ్రీనివాస్, భుక్యా రమేష్, సందకూరి లక్ష్మి, జునుమాల నగేష్, నందిపాటి రమేష్, కే.సమ్మయ్య, ఉపేష్, సూరం అయిలయ్య, చంద్రన్న రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలను మార్చుకోండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగులు, కార్మికులు రూ.కోటి ప్రమాద బీమా కవరేజీ కోసం ఇతర బ్యాంకుల ఖాతాలను ఎస్‌బీఐ లేదా యూబీఐ బ్యాంకులకు మార్చుకుని కవరేజీ పొందాలని సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ అండ్(పా) ఎన్వీకే శ్రీనివాస్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే 90 శాతం మంది ఉద్యోగులు మార్చుకున్నారని ఇంకా సింగరేణి వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో 2,767 మంది ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వీరు బ్యాంకు ఖాతా మార్చుకుని బీమా కవరేజీ పొందాలని సూచించారు.

ఏఐటీయూసీ కమిటీ ఏకగ్రీవం



అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్

పాల్వంచ: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐటీయూసీ పాల్వంచ పట్టణ, మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నారపు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఇట్టి వెంకట్రావ్, గౌరవ అధ్యక్షుడిగా వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా కోరే కృష్ణ, నరహరి నాగేశ్వరరావు, శెట్టి చేరాలు, వైఎస్ గిరి, ఎస్‌ఎ.రెహమాన్, వెంకటమణి, చంచలపురి శ్రీను, సహాయ కార్యదర్శిగా కాసర్ల రామారావు, వై.వెంకట్రామయ్య, జకరయ్య, శివరామకృష్ణ, ప్రభావతి, అల్లి కాంతయ్య, రాముతో పాటు 22 మంది కౌన్సిల్ సభ్యులు, 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. పాల్వంచలో ఎరువుల కర్మాగారం, ఆటోనగర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిరాథోడ్, జిల్లా అధికార ప్రతినిధి బానోత్ నాగరాజు కోరారు. ఆదివారం జూలూరుపాడులో సేవాలాల్ సేన ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... 10 శాతం గిరిజన రిజ్వరేషన్ పెంపు, జీఓ నంబర్ 33కు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఏజెన్సీ ప్రాంతంలో జీఓ నంబర్ 3 పునరుద్ధరించి, పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కొత్తగా ఏర్పడిన గిరిజన తండా గ్రామ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని కోరారు. వచ్చే నెల 9న హైదరాబాద్‌లో జరగనున్న సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకముందు మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం సేవాలాల్ సేన మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బానోత్ లక్ష్మణ్ నాయక్, గుగులోత్ రవి నాయక్, లకావత్ వీరన్న, భూక్యా రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగూడ్స్ గోదాం నిర్మించండి..



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

ఇల్లెందు: కొత్తగూడెం జిల్లాలో రైతులు, ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలో రైల్వేగూడ్స్ గోదాం (షెడ్) నిర్మాణం చేపట్టాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కొత్తగూడెం జిల్లా ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాళ్ల సోమసుందర్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రైలు సదుపాయం ఉన్నా గోదాం (షెడ్) లేకపోవటం వల్ల ఎరువులు, ఇతర ధాన్యం రాకపోకలకు తీవ్రం ఇబ్బందిగా మారిందని తెలిపారు. అన్ని మండలాలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. రైల్వే గూడ్స్ షెడ్‌లు ఉంటే జిల్లా వ్యాపారపరంగా మరింత అభివృద్ధి సాధిస్తుందని, రైతులకు సకాలంలో ఎరువులు లభిస్తాయని తెలిపారు. స్పందించిన ఆయన కేంద్ర రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు సోమసుందర్ తెలిపారు. దుర్గాప్రసాద్, బూర్గుపల్లి ప్రసాదరావు, వంకాయలపాటి రామలింగయ్య, దొడ్డి నాగేశ్వరరావు ఉన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న రాజేష్

ఇల్లెందు: ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం చేశారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.రాజేష్, పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మోతీలాల్ ఆరోపించారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన రెండు జిల్లా కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి 7.31 శాతం నిధులు కేటాయించటం అన్యాయం అన్నారు. ఈ నిధులు విద్యారంగానికి సరిపోవని, విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాల్సి ఉన్నా అరకొర నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కనీసం 30శాతం నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, నిరుద్యోగులకు భృతి చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నం.3 పునరుద్ధరించాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఇల్లెందురూరల్: ట్రైబల్ అడ్వయిజరీ కమిటీని నియమించడంతోపాటు జీఓ నం.3 పునరుద్ధరించి గిరిజన నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ తుడుందెబ్బ నాయకులు ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో అనేక రకాల సమస్యలతో ఆదివాసీలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు.

భారత రాజ్యాంగ గిరిజన రక్షణ కవచాలైన అటవీ హక్కుల చట్టం, పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ ఏరియా చట్టం (పెసా), 1/70, ఎల్‌టీఆర్ చట్టాలను అమలు చేయడలో గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఏజెన్సీ పరిధిలో ఆదివాసీ ప్రజల అభివృద్ధి, ఆర్థిక, సామాజిక, సంక్షేమ రంగాలలో పురోగతి సాధించాలంటే ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీలో తెగల వారీగా ఆదివాసీ సంఘాల ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీలో గిరిజనులకు నూరుశాతం రిజర్వేషన్ అవకాశం కల్పించేందుకు జీఓ నం3 పునరుద్ధరించాలని డిమండ్ చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు అడ్డుగా నిలుస్తాయని భావిస్తే మరో జీఓను జారీ చేసి అయినా ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజన వికాసం పథకంలో భాగంగా పోడు భూములలో వ్యవసాయ బోర్లు వేయాల్సి ఉన్నా సంబంధిత నిధులను డీఆర్‌డీఏకు మళ్లించడం వల్ల ఆదివాసీలకు న్యాయం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, కొడెం వెంకటేశ్వర్లు, ముక్తి రాజు, గంట సత్యం, శ్రీనాథ్, కొమరం ప్రభాకర్, సోయం చిన్నయ్య, రవి, ఎల్లబోయిన వీరయ్య, బత్తుల శ్రీనివాస్, మంకిడి రవి, రవికాంత్, మహేష్, జంగు దేవ్ పటేల్, వజ్జ రాజు, పెనుగ ప్రభాకర్, మయ్యబోయిన వెంకన్న, సూర్నపాక పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ పండుగలను సెలవుదినాలుగా ప్రకటించాలి..

టేకులపల్లి: సమ్మక్క, సారలమ్మ జాతర, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, కొమురం భీమ్ వర్ధంతి పండుగలను అధికారికంగా గుర్తిస్తూ సెలవుదినాలుగా ప్రకటించాలని టేకులపల్లికి చెందిన తెలంగాణ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఏటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి హైదారాబాద్ ప్రజాభవన్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి, కోశాధికారి ఉండం నాగేందర్‌రావు, కార్యదర్శి కుంజ కృష్ణ, వాసం నాగేశ్వరావు, కల్తీ భాస్కర్‌రారావు, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి బోనాల జాతర



బూడిదగడ్డ బస్తీలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో భక్తులు

కొత్తగూడెంటౌన్: ఆషాఢమాసం చివరి ఆదివారం భక్తులు... మహంకాళి అమ్మవారికి, పోశమ్మ, మైసమ్మ, దుర్గమ్మ, ముత్యాలమ్మ దేవతలను పూజించి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో డప్పు వాయిద్యాలతో పోతరాజుల వేశధారణలో ఆలయాలకు చేరుకున్నారు. బూడిదగడ్డ బస్తీలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆలయ ఉపాసకులు నరేంద్రభవానీ స్వామి ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎస్‌కే సాబీర్‌పాషా పాల్గొని ప్రత్యేక పూజలను చేశారు. అదేవిధంగా చిట్టి రామవరం తండాలో గ్రామస్తులు బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. చిట్టి రామవరం తండా, వనందాస్‌గడ్డ బస్తీ, నేతాజీ బస్తీలకు చెందిన మహిళలు గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు.



బోనాలతో ఆలయానికి వస్తున్న భక్తులు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని



చిట్టిరామవరంలో బోనాలతో వస్తున్న మహిళలు

ప్రారంభించారు.. వదిలేశారు..

- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- అవస్థలు పడుతున్న చిరువ్యాపారులు, వినియోగదారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు





మేదరబస్తీ, జిల్లా ఆస్పత్రి దగ్గర పని చేయని మరుగుదొడ్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టుగా మరుగుదొడ్లు లేకపోవడం వలన ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలో రెండేళ్ల క్రితం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించి ప్రారంభించారు. కానీ నిర్వహణ లేక కొన్ని మూతపడడం వలన జిల్లా వ్యాప్తంగా వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిపోయేవారు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం 11 మరుగుదొడ్లు ఉన్నాయి. ఇందులో ఐదు మాత్రమే వినియోగంలో ఉన్నాయి.

కొత్తగూడెంతో పాటుగా చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వ్యాపారాల కొరకు, వివిధ రకాల వస్తువులు కొనుగోలుకు వందల సంఖ్యలో ప్రజలు వచ్చిపోతుంటారు. వీరితో పాటుగా వివిధ షాపులలో పనిచేసే కార్మికులు, మహిళల సంఖ్యకు తగ్గట్టుగా మరుగుదొడ్లు లేవు. నిర్మించినవి పని చేయడం లేదు. దీంతో కొంతమంది రద్దీగా ఉండే ప్రాంతాలు, ప్రధాన రోడ్లలోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. తద్వారా రోడ్లపై ప్రయాణించేవారు, పాదచారులు, మహిళలు అసౌకర్యానికి గురవుతున్నారు. మేదరబస్తీలో రద్దీగా ఉండే ప్రాంతంలో మున్సిపల్‌వారు రెండేళ్ల క్రితం మరుగుదొడ్డిని నిర్మించి ప్రారంభించారు. కానీ నిర్వహణ లేకపోవడం వలన వినియోగంలో లేదు. దీని వలన మేదర సామగ్రి కొరకు వచ్చే వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. జిల్లా ఆస్పత్రి ప్రహరీని ఆనుకొని నిర్మించిన మరుగుదొడ్డి ప్రారంభించినప్పటి నుంచీ వినియోగంలో లేదు. దీని వలన జిల్లా ఆస్పత్రికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటుగా వార సంతకు ప్రతీ ఆదివారం వందల సంఖ్యలో చిరువ్యాపారులు, వినియోగదారులు వస్తారు. సంతలో ఉన్న మరుగుదొడ్డిలో కూడా నీటి సదుపాయం నిలిచిపోవడం వలన ప్రజలు, ప్రధానంగా మహిళా వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని రద్దీగా ఉండే ప్రాంతాలలో చిరు వ్యాపారులు, వినియోగదారుల కోసం మరుగుదొడ్లను వినియోగంలోనికి తీసుకరావాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



పట్టణంలో పనిచేయని మరుగుదొడ్లను వినియోగంలోనికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు రోడ్లపై మూత్రవిసర్జన చేసి అందరికీ అసౌకర్యం కలిగించవద్దు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉండడం వలన వెంటనే చర్యలు చేపట్టి పనిచేయని మరుగుదొడ్లను వినియోగంలోకి తెస్తాం.

– శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్